# ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు

- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈ నెల 3వ తేదీ ఆదివారం నిర్వహించనున్న శాసనసభ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో లెక్కింపు పరిశీలకులు గణేశ్, వినేశ్‌కుమార్, రిటర్నింగ్ అధికారుల సమక్షంలో లెక్కింపు సిబ్బంది రెండోవిడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు జరగనున్న లెక్కింపు ప్రక్రియ పర్యవేక్షణకు ఐదుగురు పరిశీలకులను నియమించినట్లు చెప్పారు. కొత్తగూడెనికి కమల్ కిశోర్, ఇల్లెందుకు హరికిశోర్, అశ్వారావుపేటకు వినేశ్‌కుమార్, భద్రాచలానికి గణేశ్, పినపాకకు కంటి శేఖర్‌సింగ్ పరిశీలకులుగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. మూడోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ ఆదివారం ఉదయం పూర్తి చేస్తామన్నారు. ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పినపాక 18 రౌండ్లు, ఇల్లెందు 18 రౌండ్లు, కొత్తగూడెం 19 రౌండ్లు, అశ్వారావుపేట 14 రౌండ్లు, భద్రాచలం 13 రౌండ్లలో లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. రౌండ్ల తర్వాత ఎన్నికల సంఘం పోర్టల్‌లో టేబుల్ వారీగా అప్‌లోడ్ చేయాలని, అప్‌లోడ్ చేయడంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి రౌండ్ షీట్‌లో రిటర్నింగ్ అధికారి, పరిశీలకులతో ధ్రువీకరణ చేయాలని, లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని, మొబైల్ ఫోన్స్ డిపాజిట్ చేసేందుకు హాలు బయట కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది ఉదయం ఆరు గంటలకు హాజరుకావాలని, ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి రౌండ్ పర్యవేక్షణకు సెక్టార్ అధికారులను నియమించాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, రాంబాబు, శిరీష, మంగీలాల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధాలు కలిగి ఉంటే చర్యలు తప్పవు

జూలూరుపాడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జీ.ప్రసాద్‌రావు


గొత్తికోయల ఇండ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు

జూలూరుపాడు, డిసెంబర్ 2 : అడవి జంతువులను వేటాడేందుకు గొత్తికోయలు ఆయుధాలను కలిగిఉంటే కఠినచర్యలు తప్పవని జూలూరుపాడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జీ.ప్రసాద్‌రావు హెచ్చరించారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఏలకలొడ్డు గ్రామ సమీపంలోని గొత్తికోయల ఇండ్లలో శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అటవీ జంతువులను వేటాడడానికి ఇండ్లలో ఉచ్చులు, వలలు, బాణాలు, ఇతర ఆయుధాలను కలిగి ఉన్నారా అని తనిఖీ చేశారు. వారివెంట అటవీశాఖ సిబ్బంది కే లక్ష్మీనర్సు, వీ మల్లయ్య, చింతా వెంకటేశ్వర్లు, కిషన్, రహీం, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన పరిశీలకులు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 2 : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను పినపాక నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా ఎన్నికల సంఘం నియమించిన కంటి శేఖర్‌సింగ్ శనివారం ఐడీవోసీకి చేరుకొని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఓట్ల లెక్కింపు పరిశీలకులు

# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

- 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలు
- రఘునాథపాలెం సీఐ శ్రీధర్


సీఐలు రమేశ్, వినయ్‌కుమార్

రఘునాథపాలెం, డిసెంబర్ 2: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆదివారం ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో విజయోత్సవ ప్రదర్శనలు, డీజేలతో ర్యాలీలు, బాణాసంచా కాల్చులు, జనం ఒకేచోట గుమిగూడడం నిషేధమని రఘునాథపాలెం సీఐ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. మద్యం అమ్మకాలపైనా నిషేధం ఉందన్నారు. ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమలుల్లో ఉంటాయని అన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

**కొత్తగూడెం టూ టౌన్‌లో..**

రామవరం, డిసెంబర్ 2: కొత్తగూడెం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, బైక్ ర్యాలీలు, పటాకులు కాల్చడం, ప్రజలు ఒకేచోట గుమికూడవద్దని టూ టౌన్ సీఐ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తగూడెం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో ఉన్న ప్రజలకు, వివిధ పార్టీల కార్యకర్తలకు శనివారం ఆయన పలు సూచనలు చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం అమ్మకాలపై కూడా నిషేధం విధించారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

**పాల్వంచలో 144 సెక్షన్..**

పాల్వంచ, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పాల్వంచ పట్టణ, మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ వెల్లడించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ఆదివారం పాల్వంచ కేఎస్‌పీ రోడ్డులోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, కౌంటింగ్ సందర్భంగా స్థానిక అల్లూరి సెంటర్ నుంచి కరకవాగు ఎంట్రెన్స్ ఉన్న భారత్ పెట్రోల్‌బంక్ వరకు నో ఎంట్రీ జోన్‌గా ప్రకటించడం జరిగిందని, నో ఎంట్రీ జోన్‌లోకి ఎవరికీ అనుమతి ఉండదని, ఎటువంటి వాహనాలు అనుమతించమని చెప్పారు. పాల్వంచ పట్టణవ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ ఎవరూ గుమికూడవద్దని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించవద్దని హెచ్చరించారు. కరకవాగు, కిన్నెరసాని, ఉల్వనూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు పాల్వంచ నవభారత్ ప్రాంతంలోని జెన్కోకాలనీ ఎదురుగా ఉన్న ప్రియదర్శినికాలనీ, సీతారాంపట్నం మీదుగా భారత్ పెట్రోల్ బంక్ ఏరియా నుంచి కిన్నెరసాని వైపు ప్రయాణించాల్సి ఉంటుందని సూచించారు.

# యోగా పోటీల్లో ఎస్‌ఆర్ విద్యార్థికి చాంపియన్‌షిప్


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ వరదారెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 2: నగరంలోని ఎస్‌ఆర్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న గంటా హేమంత్ సాయి అనే విద్యార్థి యోగా పోటీల్లో నేషనల్ చాంపియన్‌షిప్ సాధించాడు. దీంతో ఎస్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏ.వరదారెడ్డి ఆ విద్యార్థిని అభినందించారు. ఎస్‌ఆర్ విద్యాసంస్థల్లో నిర్వహించిన అభినందన సభలో శనివారం సదరు విద్యార్థి హేమంత్ సాయికి మెమెంటో, పుష్పగుచ్ఛం అందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థల్లో చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ ప్రతిభ కనబర్చేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థి హేమంత్ సాయి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ భాస్కర్‌రెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ దివ్యాంగుల దినోత్సవం


మాట్లాడుతున్న జడ్జి భానుమతి


కేక్ కట్ చేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి విజేత

పాల్వంచ, డిసెంబర్ 2 : జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. స్థానిక పాల్వంచ పట్టణంలో శనివారం ఉదయం 11 గంటలకు జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పాల్వంచలోని చెవిటి, మూగ, బదిరుల పాఠశాల(ఆగాపే)లో కేక్ కట్ చేశారు. న్యాయవాది అనుగ్రోలు రాంప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి మాట్లాడుతూ బదిరులనే భావన లేకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలని, మన దేశంలో చాలామంది వికలాంగులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించారని, మీరు కూడా ధైర్యంగా వారిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత పదవులు అలంకరించాలని కోరారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో రేపాక ప్రసాదరావు, ఎండీ రజాక్, బార్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్ పాల్గొన్నారు.

**టీవీపీఎస్ ఆధ్వర్యంలో..**

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 2 : తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వహించాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన అన్నింటిని అందేలా చూస్తానని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయిస్తానని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో గుండపనేని సతీశ్, కాటి నాగేశ్వరరావు, జగ్గు దాస్, రాము, లింగయ్య, కళాబాబు, చాంద్ పాషా, రాము, కరుణాకర్, నయీం, అల్తాఫ్, వెంకటేశ్వర్లు, జర్రు బాబు, బాబూరావు, నర్సయ్య పాల్గొన్నారు.

# స్నేహితురాలికి ఆర్థిక సాయం

పాల్వంచ, డిసెంబర్ 2 : పట్టణంలోని బొల్లోరిగూడెం జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి(1985-86) చదువుకున్న విద్యార్థులు తోటి మిత్రుడికి ఆర్థికసాయం చేశారు. తమతోపాటు చదివిన విద్యార్థిని గీతారాణి ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని అందరూ కలిసి చేయూతనందించారు. రూ.లక్ష నగదును శనివారం కేటీపీఎస్ ఇంజినీరింగ్ అసోసియేషన్ హాల్‌లో అందించారు. పదిరోజులుగా పూర్వ విద్యార్థులంతా తోటి విద్యార్థుల నుంచి వసూలు చేసిన లక్ష రూపాయల నగదును గీతారాణికి చేతికి అందించి నీకు అండగా మేమంతా ఉన్నామంటూ భరోసా కల్పించారు. బంధువులు ఎంతమంది ఉన్నా కానీ తనను ఆదుకునేందుకు ఎవరూ ముందుకురాలేదని, తన పరిస్థితిని తెలుసుకొని తనకు సాయం చేసిన తోటి పూర్వ విద్యార్థులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపింది గీతారాణి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొమ్మకంటి వీరభద్రం, వీరయ్య, తోట మల్లేశ్వరరావు, వేముల శ్రీను, గాడేపల్లి వీరభద్రం, శ్రీపాద విజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న తోటి స్నేహితులు